# బడి తెరిచే రోజునే 'జగనన్న కానుక'

- ఈనెల 12 నుంచి జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ
- మండల స్టాక్ పాయింట్లకు చేరుకుంటున్న వస్తువులు
- ఉంగుటూరు, దెండులూరుల్లో 36,812 విద్యార్థులకు లబ్ధి


నిడమర్రు స్టాక్ పాయింట్‌కు చేరుకున్న పాఠ్యపుస్తకాలు


నాణ్యత పరిశీలించేందుకు నిడమర్రు ఎంఈవో కార్యాలయంలో విద్యాకానుక వస్తువుల ప్రదర్శన

నిడమర్రు: విద్యార్థులకు వేసవి సెలవులు ఈనెల 11తో ముగియనున్నాయి. 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. నూతన విద్యా సంవత్సరం 2023–24లో అడుగు పెడుతున్న రోజే ప్రతి విద్యార్థి చేతుల్లో జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే మండల కేంద్రాల స్టాక్ పాయింట్లకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, యూనిఫారం, బ్యాగులు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బెల్టులు, బూట్లు ఒక్కొక్కటిగా చేరుతున్నాయి. ఈనెల 7వ తేదీలోపు జగనన్న కిట్లలోని అన్ని వస్తువలు మండల కేంద్రాలకు చేరుకునేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసారు. నిర్దిష్ట సమయంలో పాఠశాలల స్టాక్ పాయింట్లకు తరలించేలా తేదీలను సైతం నిర్ణయించారు. 10వ తేదీలోపు అన్ని స్కూళ్ల వద్ద పూర్తి స్థాయిలో జగనన్న విద్యాకానుక పథకంలోని ప్రతి వస్తువు చేరేలా సంబంధిత సిబ్బందికి కృషి చేస్తున్నారు. స్కూళ్లకు తరలింపు ప్రక్రియ పురోగతిపై జిల్లా విద్యాశాఖ ఎప్పటికప్పుడు తగిన సమీక్షలు నిర్వహిస్తున్నట్లు నిడమర్రు మండల విద్యాశాఖ అధికారి పుచ్చల శేషు తెలిపారు. ఉంగుటూరు, దెండులూరు నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో 36,812 జేవీకే కిట్లు అందించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

| ఉంగుటూరు నియోజకవర్గంలో.. | |
|---|---|
| మండలం | జగనన్న కిట్లు |
| ఉంగుటూరు | 6,291 |
| భీమడోలు | 4,893 |
| గణపవరం | 4,462 |
| నిడమర్రు | 3,083 |
| మొత్తం | 18,729 |

| దెండులూరు నియోజకవర్గంలో.. | |
|---|---|
| మండలం | జగనన్న కిట్లు |
| దెండులూరు | 5,100 |
| పెదవేగి | 7,836 |
| పెదపాడు | 5,147 |
| మొత్తం | 18,083 |

**జేవీకే కిట్ల నాణ్యత తనిఖీకి ఏర్పాట్లు**

జగనన్న విద్యాకానుక కిట్లలోని ప్రతి వస్తువు నాణ్యతను ఎవ్వరైనా తనఖీ చేసుకునేలా ఎంఈవో కార్యాలయాల వద్ద ప్రత్యేకంగా జేవీకేలోని వస్తువులను ప్రదర్శిస్తున్నారు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకమైన మిర్రర్‌తోకూడిన ఇనుప అలమరలు మండల కేంద్రాలకు సరఫరా చేసింది. ఈ అలమరల్లో జేవీకేలో అందించే యూనిఫారం, నోట్ బుక్స్, బెల్ట్, బ్యాగ్‌లు, పాఠ్యపుస్తకాలు, డిక్షనరీ వంటివి ఒక్కొక్కటిగా నమూనాగా ప్రదర్శిస్తారు. వీటిని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు వస్తువుల నాణ్యత నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో, లేదో అనే విషయం గుర్తించి ఏవైనా లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేసారు.

**20శాతం పెరిగిన యూనిఫారం క్లాత్ పరిమాణం**

యూనిఫారం క్లాత్ గతంలో మాదిరిగా కాకుండా బాలికల టాప్, బాలుర షర్ట్‌లను ప్లెయిన్ క్లాత్ నుంచి చెక్స్ (గడులు) రూపంలోకి మార్పు చేసారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా క్లాత్ పరిమాణాన్ని దాదాపు 20శాతం పెంచారు. ప్రతి విద్యార్థికి గతంలో మాదిరిగా రెండు జతలు యూనిఫారం కాకుండా మూడు జతల యూనిఫారం క్లాత్ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## జేవీకే కిట్ల ప్రదర్శనకు ప్రత్యేక బాక్స్‌లు



అన్ని స్టాక్ పాయింట్ల వద్ద జగనన్న విద్యాకానుకలోని సామగ్రి ప్రదర్శించేలా ప్రభుత్వం ప్రత్యేక ఐరన్ బాక్స్‌లను పంపిణీ చేసింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజా ప్రతినిధులు సందర్శించి కిట్లలో గుత్తేదారులు పంపిణీ చేసిన వస్తువుల నాణ్యతను తనిఖీ చేసుకునే అవకాశం ప్రభుత్వం తొలిసారి కల్పించింది.

– సబ్బిత నరసింహమూర్తి, ఎంఈవో, ఏలూరు

## నిర్దేశించిన ప్రమాణాలు లేకపోతే వెనక్కి



పాఠశాలల స్టాక్ పాయింట్‌కు చేరుతున్న జగనన్న విద్యా కానుక కిట్లలో సూచించిన నాణ్యత ప్రమాణాలకు అనగుణంగా లేకపోతే పాఠశాల నుంచే తిరిగి వెనక్కి పంపించేయవచ్చు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే సామగ్రిపై ఇంత పారదర్శకతను ప్రదర్శించలేదు. జేవీకే కిట్లపై విమర్శలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ నాణ్యత తనిఖీ చేసుకునే అవకాశం కల్పించాం.

– పుప్పాల శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

### క్లుప్తంగా

## విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు


విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్

పెదవేగి : వేసవిలో విద్యార్థులకు ప్రభుత్వం చక్కటి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు వేసవి శిక్షణ తరగతులను ఏర్పాటు చేసిందని పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ అన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా గ్రంథాలయాల్లో విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివారం నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పేకాట, కోడిపందేలపై దాడి

పెదవేగి : రెండు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట, కోడిపందేల స్థావరాలపై పోలీసులు మెరుపు దాడి చేశారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పాకలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, ఘటనా ప్రదేశంలో నలుగురు వ్యక్తులు వారి వద్ద నుంచి రూ. 2,950 నగదు, 4 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. అనంతరం కూచింపూడిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, ఇద్దరి నుంచి రూ.2,400 నగదు, ఒక కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకే పెద్దపీట వేస్తామని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చెప్పారు. ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కేసుల నమోదు, పెండింగ్ కేసులు, దర్యాప్తు తదితర విషయాలపై ఆరా తీశారు. రూరల్ స్టేషన్ ఆవరణలోని ఆయా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా, మర్యాదగా నడచుకోవాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ప్రజలకు రక్షణ నిలవటంతోపాటు, శాంతిభద్రతలను నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సూచించారు. ఆయా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, కేసుల దర్యాప్తు, కోర్టుల్లో ఛార్జిషీటు దాఖలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. నిందితుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు ఉండాలని డీఎస్పీ సూచించారు. ఈ తనిఖీల్లో ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్, రూరల్ ఎస్సై ఎన్.లక్ష్మణబాబు ఉన్నారు.

## ఏలూరు చేరుకున్న తిరుమల పాదయాత్రికులు


ఏలూరు చేరుకున్న పాదయాత్రికులు భోగి గణపతి పీఠం ప్రతినిధి రమణ రాజు, గోవింద స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కాకినాడకు చెందిన శ్రీ భోగి గణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణ రాజు ఆధ్వర్యంలో కాకినాడ నుంచి తిరుమల వరకూ చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఏలూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా రమణ రాజు మాట్లాడుతూ 2008వ సంవత్సరంలో భోగి మంటల్లో వెలసిన స్వయంభూ భోగి గణపతి విగ్రహానికి సంపూర్ణ కాంస్య కవచ ధారణ యజ్ఞం చేపట్టామన్నారు. ఈ యజ్ఞం విజయవంతంగా పూర్తి కావాలనే ఆశయంతో తిరుమలకు 41 రోజుల పాదయాత్ర చేపట్టామన్నారు. ఈ యాత్ర అనంతరం కాకినాడ భోగిగణపతి పీఠంలో 9 రోజులపాటు నిత్య అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. రమణరాజు వెంట గోవిందస్వామి యాత్రలో పాల్గొంటున్నారు.

## వైభవంగా మార్కండేయ స్వామి గ్రామోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దక్షిణపు వీధిలోని మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్య హోమం బలిహరణ, అనంతరం ఆలయంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి క్షీరాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం నిత్య హోమాలు, బలిహరణ పూజలు, అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేసి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కందుకూరి కన్నబాబు విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి డీ. శంకర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

## పుంత రోడ్డు అభివృద్ధి


రహదారి నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ

పెదపాడు: రైతులకు ప్రయాణికుల సౌకర్యార్థం వసంతవాడ నుంచి అప్పనవీడు వద్ద జాతీయ రహదారిని కలిపేందుకు నూతనంగా పుంత రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ తెలిపారు. ఆదివారం వసంతవాడ నుంచి అప్పనవీడు వరకు నిర్మిస్తున్న పుంత రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పుంతరోడ్డుపై అవగాహన లేక రైతులు సరిహద్దులో ఉన్న స్థలాన్ని తమ ఆధీనంలో ఉంచుకున్నారని అన్నారు. జాతీయ రహదారి ఏర్పడిన తర్వాత గ్రామానికి అతి చేరువగా ఉండటంతో రోడ్డు అభివృద్ధి చేస్తే సమీప రైతులకు, గోగుంట, రాజుపేట, వసంతవాడ గ్రామాల ప్రజలు హనుమాన్ జంక్షన్ వెళ్లేందుకు, జాతీయ రహదారిని చేరుకునేందుకు వీలుగా ఉంటుందని అన్నారు. పుంతకు ఇరువైపులా ఉన్న రైతులతో సమీక్షించి, వారిని ఒప్పించామన్నారు. తొలుత మట్టితో మెరక చేసి గ్రావెల్ రహదారి నిర్మించాలనే ఆలోచనతో ఈ పనులు చేపట్టామన్నారు. ఈ రహదారి అభివృద్ధికి సహకరించిన ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, దెండులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు వసంతవాడ, అప్పనవీడు సర్పంచ్‌లు చింతల రమాభారతి, చిన్నాల ఝాన్సీ సహకారం అందించారని తెలిపారు. స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంబాబు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## గంగాధర్ కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ


కొవ్వలి సర్పంచ్ ఇంటేటి మధులతను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ డాక్టర్ పండుల రవీంద్రబాబు

0దెండులూరు: వైఎస్సార్ సీపీ నేత, సర్వశిక్షాభియాన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఇంటేటి గంగాధర్ ఆకస్మిక మరణం తమను కలిచివేసిందని మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ డాక్టర్ పండుల రవీంద్రబాబు అన్నారు. ఆదివారం కొవ్వలిలో గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సతీమణి సర్పంచ్ మధులత, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. గంగాధర్ సేవలను ఎమ్మెల్సీ కొనియాడారు. దెండులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల పార్టీ ప్రెసిడెంట్ కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం గంగరాజు, వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, నాయకులు బూసి ఎఫ్రాయమ్, గొరిపర్తి రంగారావు, గొల్ల వీరాస్వామి, గొల్ల కిరణ్, తపన సంస్థ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి, వివిధ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

## రహదారులన్నీ అభివృద్ధి చేశాం


ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెండులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహాయ సహకారాలతో దెండులూరు నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధి చేశామని తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎక్కడ రోడ్లు వేయించారో ప్రజలు తెలుసునని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెండులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. దెండులూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలి అజెండా ప్రజల సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన లక్ష్యాలుగా పని చేస్తోందన్నారు. దెండులూరు నియోజకవర్గంలో ఏలూరు, జంగారెడ్డిగూడెం రోడ్డు, రూ. 29 కోట్లతో ఏలూరు, చింతలపూడి రోడ్డు, రూ. 55 కోట్లతో ఏలూరు, కైకలూరు రోడ్డు, రూ.27 కోట్లతో పెదపాడు, పెరికిడ్లు రోడ్డు, దెండులూరు, పంగిడిగూడెం, కొప్పాక, వట్లూరు, విజయరాయి, పెదవేగి, వంగూరు, కవ్వగుంట, జానంపేట, 7వ మైలు, తాళ్లగోకవరం, బాదరాల, రామశింగవరం, గోపన్నపాలెం, రామశింగవరం రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో ఉండే ప్రజలకు ఎక్కడ, ఎప్పుడు, ఎవరు రోడ్లు వేశారో తెలుసునని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. వాస్తవానికి రోడ్ల నిర్మాణ పనులు దెండులూరు నియోజకవర్గంలో ఇలా ఉంటే.... వాటిని ప్రస్తావించకుండా నియోజకవర్గంలో రోడ్లు బాగాలేదంటూ ఎల్లో మీడియా, టీడీపీ నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. మరోసారి దెండులూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమని ఎమ్మెల్యేగా తన విజయం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**రైతులందరూ సంతోషంగా ఉండాలి**

రాష్ట్రంతోపాటు, నియోజకవర్గంలోని ప్రతి రైతు సంతోషంగా ఉండాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెండులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలను రైతులకు తెలియజేశారు. ఈ ఏడాది వానలు పడి, పంటలు సమృద్ధిగా పంటలు పండి రైతులందరూ సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాక్షించారు.

## నవరత్న పథకాలతో అన్ని వర్గాల్లో సంతృప్తి

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- నిడమర్రులో గడపగడపకు మన ప్రభుత్వం


నిడమర్రులో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. నిడమర్రులో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం ఆదివారంతో ఉత్సాహంగా ముగిసింది. నియోజకవర్గంలో ఈ కార్యక్రమం 163వ రోజుకు చేరుకుందని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలందరికీ ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మొదట నిలిచారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితికి మించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చేలా జగనన్న కృషి చేస్తున్నారన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారన్నారు. అర్హుడైన ప్రతి వ్యక్తి ఏ నేతలు చుట్టూ తిరగకుండా నేరుగా గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి స్వయంగా దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందే అవకాశం ఏపీ ప్రజలకు మాత్రమే ఉందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వాసుబాబు ఓటర్లును కోరారు. గడపగడప కార్యక్రమంలో స్థానికులు చెప్పిన సమస్యలు తక్షణం పరిష్కరించేలా ఎమ్మెల్యే వాసుబాబు గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేసారు. జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సచివాలయం మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుడిసే జాన్‌బాబు, సర్పంచ్ పొట్నూరి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు దూసనపూడి సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు మండ పోలయ్య, చలంశెట్టి బాబులు, ఎలిశెట్టి మురళి, తలమింటి వెంకటేష్, వగ్వాల రాధాకృష్ణ, రుద్ర సుబ్బరావు, కన్నాజి రామకృష్ణ, సూతాని యోసు, అంబళ్ల శ్రీను, పతివాడ శ్రీను, శానపతి శ్రీను తదితరులున్నారు.

## బాధిత కుటుంబాల్లో మనో ధైర్యాన్ని నింపాలి


భీమడోలు లైబ్రరీలో రైలు ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న మండే సుధాకర్, చిన్నారులు


పోతునూరు గ్రంథాలయంలో నీతికథలు వింటున్న చిన్నారులు

భీమడోలు: ఒడిశాలోని ఘోర రైలు ప్రమాదం పెను విషాదాన్ని నింపిందని, ప్రభుత్వం వారికి అండగా ఉండి బాధితుల కుటుంబాలకు మనోధైర్యాన్ని నింపాలని రిటైర్డ్ హెచ్ఎం, భీమడోలు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 28వ రోజైన ఆదివారం ఉల్లాస భరిత వాతావరణంలో నిర్వహించారు. చిన్నారులకు నీతి కథలు, నైతిక విలువగల కథలు, పుస్తక సమీక్షలు రాసారు. అనంతరం ఒడిసాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి ఆత్మకు శాంతి చేకూరాలంటూ విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రమాదం జరిగిన తీరును చిన్నారులకు వివరించారు. పత్రికల్లో వచ్చిన కథనాలను చిన్నారులతో చదివించారు. ఈ సందర్భంగా తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే పెను విషాదాన్ని నింపిన ఈ ప్రమాదం ప్రజలందరిలో తీవ్ర దిగ్భ్రాంతిని నింపిందన్నారు. అనంతరం వివిధ క్రీడాంశాల్లో విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు మండే సుధాకర్, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నీతికథల సారాంశాన్ని అన్వయించుకోవాలి**

దెండులూరు: చిన్నారులు ప్రాథమిక స్థాయి నుంచి సక్రమమైన జీవనవిధానం, విద్య, క్రీడలతో పాటు సమాన ప్రాధాన్యతనివ్వాలని పోతునూరు గ్రంథాలయాధికారి డీ.జాన్‌బాబు అన్నారు. ఆదివారం పోతునూరు గ్రంథాలయంలో చిన్నారులకు రిసోర్స్ పర్సన్ నీతికథలు చెప్పారు. కంప్యూటర్ విద్యపై అవగాహన కల్పించారు. దెండులూరులో గ్రంథాలయాధికారి ఝాన్సీ పుస్తక పఠనం, చెస్, క్యారెమ్స్, క్విజ్, పోటీలపై అవగాహన కల్పించారు.

## మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి

ఏలూరు (టూటౌన్): ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఏలూరు కోటదిబ్బ ప్రాంతంలోని నేరెళ్ళరాజా కల్యాణ మండపంలో సోషల్ మీడియా ప్రభావితం చేసే వ్యక్తుల ప్రత్యేక సమావేశం ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దేశంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

## నేడు పెదనింద్రకొలనులో గడపగడపకు..

నిడమర్రు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం (164వ రోజు) పెదనింద్రకొలనులో సోమవారం సాయంత్రం 5 గంటలనుంచి నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి జరిగిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గోవాలని సత్యకుమార్ కోరారు.

## పరిశ్రమల వ్యర్థాలతో పర్యావరణానికి విఘాతం


ఉంగుటూరు -నీలాద్రిపురం రహదారిలో పడేసిన వ్యర్థాలు


నారాయణపురం అటవీ ప్రాంతం రహదారిలో..

ఉంగుటూరు: పరిశ్రమల వ్యర్థాలతో ఉంగుటూరు మండలంలో పర్యావరణానికి విఘాతం ఏర్పడింది. దాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన దశాబ్దకాలంలో వందకు పైగా పరిశ్రమలు మండలం పరిధిలోని 5 గ్రామ పంచాయతీల్లో విస్తరించాయి. ఐస్ పరిశ్రమలు, కోళ్ల పరిశ్రమలు, సిరామిక్ పరిశ్రమలు, థర్మాకోల్ పెట్టెల తయారీ, కోడిగడ్డు అట్టల తయారీ, పేపరు తయారీ పరిశ్రమలు విస్తరించాయి. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను ఆయా పరిశ్రమలు ఆరుబయటే పడేస్తున్నాయి. ప్రతి పరిశ్రమ బయట పడేసిన వ్యర్థాలను దాటుకుని పాదచారులు, ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు ప్రయాణం సాగించాల్సి వస్తోంది. పరిశ్రమల కాలుష్యంపై సంబంధిత శాఖల అధికార్లు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఓవైపు పరిశ్రమల సంఖ్య పెరగడంతో ఉపాధి అవకాశాలు పెరిగాయన్న ఆనందం కన్నా కాలుష్యం కోరల్లో జీవించాల్సి వస్తోందనే బాధ ఆయాగ్రామాల ప్రజలను పట్టిపీడిస్తోంది. ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురం, బాదంపూడి, చేబ్రోలు, కైకరం, నారాయణపురం, నీలాద్రిపురం, నాచుగుంట, యర్రమళ్ల, వెల్లమిల్లి, కొత్తగూడెం, గోపినాథపట్నం, తిమ్మయ్యపాలెం, తదితర గ్రామాల్లో పరిశ్రమల కాలుష్య ప్రభావం పడుతోంది.

## వ్యర్థాలపై ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటాం



వ్యర్థాలు కొంత వరకు పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నాము. పూర్తిస్థాయిలో వ్యర్థాలను తొలగించేందుకు పరిశ్రమలు వారికి నోటీసులు జారీ చేస్తాం. వ్యర్థాలు రోడ్ల పక్కన ఎక్కువగానే ఉంటున్నాయి. ప్రజలు ఫిర్యాదు అందిస్తే చర్యలు తీసుకుంటాం.

– గిరిధర్, పంచాయతీ కార్యదర్శి, ఉంగుటూరు